క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


విత్తనాల దుకాణంలో స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి దీపిక

నర్సాపూర్ : విత్తనాలు ఎరువుల డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి దీపిక హెచ్చరించారు. మంగళవారం ఆమె పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీ చేశారు. రైతులకు రసీదులు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. అనంతరం పలు దుకాణాల నుంచి విత్తనాల శాంపిల్స్‌ను సేకరించారు. శాంపిల్స్ ల్యాబ్‌కు పంపుతామని పేర్కొన్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం


ఆర్మీ జవాన్ మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్) : దేశం కోసం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని వచ్చిన ఆర్మీ జవాన్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం సొంతూరికి రావడంతో గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు, మేళా తాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, యువకులు పాల్గొన్నారు.

కరీం కుంట ఎఫ్‌టీఎల్ గుర్తింపు


కరీంకుంట ఎఫ్‌టీఎల్ గుర్తిస్తున్న ఇరిగేషన్ అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట మండలం కొంతన్‌పల్లిలోని కరీంకుంట ఎఫ్‌టీఎల్‌ను గుర్తించారు. కుంట శిఖం భూమి కబ్జాకు గురైన విషయం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. మంగళవారం ఇరిగేషన్ ఏఈ సుధీర్‌కుమార్ కరీంకుంట ఎఫ్‌టీఎల్ భూమి గుర్తించారు. వెంచర్ నిర్వాహకులకు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి రోడ్డు పనులు చేశారని వారికి నోటీసు జారీ చేసి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల జాయింట్ సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని ఏఈ సుధీర్‌కుమార్ తెలిపారు.

భూవివాదాలు పరిష్కరిస్తాం

అదనపు కలెక్టర్ నగేశ్

రామాయంపేట(మెదక్): రెవెన్యూ, అటవీశాఖల మధ్య నెలకొన్న భూవివాదాలను పరిష్కరిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్ హామీ ఇచ్చారు. మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో మంగళవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు శాఖలకు సంబంధించి జాయింట్ సర్వే నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో భూభారతి సదస్సులు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు భూసమస్యలను అధికారుల దృష్టికి తీసుకవస్తున్నారని వివరించారు. తహసీల్దార్ రజని కుమారి, ఆర్ఐ గౌస్, రైతులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనతో టీబీ దూరం

గజ్వేల్‌రూరల్: వైద్యుల సలహాలు, సూచనలు పాటించి టీబీని తరిమికొడదామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అహ్మదీపూర్ పీహెచ్‌సీలో టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం టీబీ(ట్యూబర్ క్లోసిస్) వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించినట్లయితే పూర్తిగా అరికట్టవచ్చన్నారు. టీబీ రహిత జిల్లాగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, వైద్యులు ప్రణయ్‌కుమార్, బల్బీర్‌సింగ్, రాజశేఖర్, మహారాజ్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను మంగళవారం కార్పొరేటర్ పుష్ప పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా పూర్తి చేయాలని కోరారు. సీసీ రోడ్డును అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం శివకృష్ణ, మేనేజర్ లోకేష్, నాయకులు పీటర్, సామ్రాట్, హబీబ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగు నీరు

- వెదజల్లుతున్న దుర్గంధం
- అవస్థలు పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు


అల్లాదుర్గంలో గాంధీ విగ్రహం ఎదుట ప్రవహిస్తున్న మురుగు నీరు

సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది. గ్రామాలకు, మండలాలకు మండల, జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. నిధులు రాకపోవడంతో కార్యదర్శులు, అధికారులు ముఖం చాటేస్తున్నారు. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ కుంటుపడింది.

అల్లాదుర్గం(మెదక్): పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి పనులు చేయిస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో వారు ముందుకు రావడం లేదు. గ్రామ, మండల స్థాయి అధికారులు కూడా జాడలేకుండా పోయారు. మండల కేంద్రమైన అల్లాదుర్గంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. దుర్వాసన వెదల్లడంతో తీవ్రమైన బాధలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

మురుగు కూపంలా బస్టాండ్ ప్రాంతం

బస్టాండ్ ప్రాంతంలో హోటళ్లు, ఇళ్లు, మాంసం దుకాణాలు ఉన్నాయి. దీంతో డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. మురుగు నీరు ముందుకు పోవడంలేదు. ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో తమ వ్యాపారాలు చేసుకోలేకపోతున్నామని దుకాణాదారులు, హోటళ్ల యజమానులు వాపోతున్నారు. బస్టాండ్ ప్రాంతంలోనే మహాత్మ గాంధీ విగ్రహం ఎదుట మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. మహాత్మా.. ఏమిటి ఈ దుస్థితి అని స్థానికులు ముక్కు మూసుకుంటున్నారు.

కానరాని అధికారులు

మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో కనిపించడం లేదని, మొక్కుబడిగా కార్యాలయాలకు వచ్చి వెళ్లిపోతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి కొందరైతే ఎంపీపీ కార్యాలయంలోనే ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీ కార్యాలయాల్లో ఉండాల్సిన కార్యదర్శులు 11 దాటిన తర్వత కార్యాలయంలో గంట, రెండు గంటలు ఉండి వెళ్లి పోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కొరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి

గ్రామాల్లో లెక్చరర్ల ప్రచారం


లింగంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న లెక్చరర్లు

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కొడిపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలని మంగళవారం పలు గ్రామాలలో లెక్చరర్లు ప్రచారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు లెక్చరర్లు సురేందర్ రెడ్డి, మణికాంత్‌రావ్, దుర్గయ్య, భాస్కర్ తదితరులు కొట్టాల, లింగంపల్లి, లింగంపల్లితండా, వెల్దుర్తి మండలం అందుగులపల్లి గ్రామాలలో విద్యార్థులు ఇంటికి వెళ్లి కరపత్రాలతో ప్రచారం చేశారు. కొడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన వసతులు ఉన్నాయని నాణ్యమైన విద్యాబోధన అందుతుందని చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరితే బీటెక్ ఉచితంగా చదవవచ్చని అవగాహన కల్పించారు.

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ పుష్పవేణి కోరారు. మంగళవారం చిన్నశంకరంపేట ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం దీప్లారాథోడ్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్జాపల్లిలో...

మండలంలోని మిర్జాపల్లి ప్రాథమిక పాఠశాల పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బాలరాజు మాట్లాడుతూ.. విద్యార్థులను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు.

పచ్చిరొట్ట.. పంటకు దిట్ట

పెద్దశంకరంపేట ఏడీఏ రాంప్రసాద్




టేక్మాల్‌లో సాగుతున్న పచ్చిరొట్ట (ఫైల్)

టేక్మాల్(మెదక్): తొలకరి వర్షాలు కురిసే సమయంలో భూమిని ఖాళీగా ఉంచకుండా పచ్చిరొట్ట విత్తనాలు జల్లుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు పెద్దశంకరంపేట ఏడీఏ రాంప్రసాద్. టేక్మాల్‌లో ఆయన రైతులకు పచ్చిరొట్ట పెంపకంపై అవగాహన కల్పించారు. రైతులు పచ్చిరొట్ట పెంపకంపై తప్పనిసరిగా అవగాహన ఉండాలన్నారు. ప్రధానంగా జీలుగా, జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలను ఈ సీజన్‌లో పొలాల్లో జల్లినట్టయితే రసాయన ఎరువులతో అంతగా పని ఉండదని ఆయన వివరించారు.

పచ్చిరొట్టతో ఇవీ ఉపయోగాలు

జీలుగా, జనుము విత్తనాలు చల్లుకోవడం ద్వారా నేల కోతకు గురికాదు. పచ్చిరొట్ట పైరు పొలంలో కలుపు మొక్కల పెరుగుదలను పూర్తిగా నియంత్రిస్తుంది. పచ్చిరొట్ట పైరు పూతదశలో ఉండగా లేదా విత్తనాలు వేసిన 50రోజుల తర్వాత పొలంను కలియదున్నాలి. ఆ విధంగా దున్నడం వలన నేలకు సేంద్రియ పదార్థం సమకూరుతుంది. అలాగే నేల గుల్లబారుతుంది. తద్వారా మొక్కల వేళ్ల బాగా పెరిగి పోషకులు బాగా గ్రహిస్తాయి. నేలల్లో చౌడు తగ్గుతుంది. నేలకు మేలు చేసే సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయి. జనుము, జీలుగు వేర్లపై ఉండే బుడిపెలు గాలిలో నత్రజనిని స్థిరీకరిస్తాయి. కుళ్లిన రొట్ట ద్వారా భూమికి నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి ఎరువులు ఆ తర్వాత వేసే పంటలకు లభిస్తాయి. సూక్ష్మపోషకాలైన ఇనుము, జింక్, మెగ్నీషియం, కాల్షియం వంటివి భూమి నుంచి లభిస్తాయి. పచ్చిరొట్ట పైర్ల వల్ల ఎకరాకు 7కిలోల నత్రజని, 1.2కిలోల భాస్వరం, 5కిలోల పొటాష్ వంటి ఎరువులు పంటకు లభిస్తాయి. తద్వారా ఎరువుల వాడకం సగానికి సగం తగ్గి దిగుబడి పెరుగుతుంది. పచ్చిరొట్ట పైరును భూమిలో కలియదున్నిన 15రోజుల తర్వాత పొలంలో నాట్లు వేయవచ్చు.

పత్తిలో అరకతో కలుపుతీత

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల్లోరైతులు పత్తి పంటలో అరకతో కలుపుతీత పనులు నిర్వహిస్తున్నారు. మంగళవారం మండలంలోని పిల్లోడి, మన్‌సాన్‌పల్లి, తాటిపల్లి, పెద్దలోడి గ్రామాల్లో పత్తి సాళల్లో అరకతో కలుపుతీస్తున్నారు. మరికొందరు రైతులు దాట్లు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కూలీల కొరతను నివారించేందుకు రైతులు అరకతో కలుపుతీస్తున్నారు.

సబ్‌స్టేషన్ మరమ్మతులకు నిధులు మంజూరు

పాపన్నపేట(మెదక్): సమస్యలతో కునారిల్లుతున్న కొడుపాక సబ్‌స్టేషన్ మరమ్మతులకు రూ.12,34,887 మంజూరయ్యాయి. 20 ఏళ్ల క్రితం కొడుపాకలో నిర్మించిన సబ్‌స్టేషన్ చుట్టూ ఆర్‌సీసి పోల్స్‌తో పాటు ఫెన్సింగ్, యార్డు ఏర్పాటు, బోరుబావి, కంట్రోల్ రూం మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేస్తూ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ చైర్మన్ ముషారఫ్ ఫరూఖీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తుజాల్‌పూర్ పాఠశాలలో అక్షరాభ్యాసం

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ ఆధ్వర్యంలో అంగన్ వాడీ కేంద్రం నుంచి వచ్చిన పిల్లలను పాఠశాలలో చేర్పించుకొని అక్షరాభ్యాసం చేయించారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు నర్సింలు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నాగోల్ శ్రీ నేత్రాలయ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంటి సమస్యలు ఉన్న వారు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకొని విజయవంతం చేయాలని కోరారు.

19లోగా దరఖాస్తు చేసుకోండి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నఘనాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తాత్కాలిక పద్ధతిన ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఆంగ్లం మాధ్యమంలో బోధించుటకు, అర్హతగల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి సత్యనారాయణ రావు కోరారు. టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. టీచర్ అభ్యర్థి ఇంటర్మీడియెట్, డీఎడ్ అర్హత కలిగి ఉండాలని, నెలసరి గౌరవ వేతనం కింద రూ.8వేలు, ఆయా అభ్యర్థికి చదివి ఉండాలని నెల వేతనం రూ.6 వేలు ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలన్నారు. 20న డెమో క్లాసుల ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం


రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ మైపాల్

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న భూ భారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఆర్‌డీఓ మైపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని చండీ, గోమారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గోమారంలో నిర్వహించిన సదస్సును ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్, ఆర్ఐ కిషన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి భూమి పూజ


ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న హౌజింగ్ ఏఈ హరిత

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు మంగళవారం పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. మెదక్ ఎమ్మెల్యే కృషితో గ్రామానికి 10 ఇళ్లు మంజూరయ్యాయని సుప్రభాతరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ఏఈ హరిత, మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు యాదగిరి, గంగాధర్, నాయకులు వెంకటి, స్వామితోపాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

దళితులపై దాడి దారుణం

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్


విలేకరులతో మాట్లాడుతున్న శంకర్

నిజాంపేట(మెదక్): దళితుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని బచ్చురాజ్ పల్లికి చెందిన దళితుడు గాజులపల్లి స్వామి తన పొలంలో ట్రాకర్‌తో దున్నుతుండగా అడ్డగించి దాడికి పాల్పడిన తిప్పనగుళ్ళకు చెందిన సహదేవ్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. గ్రామంలోని సర్వే నంబరు 163, 164లోని 3.30 ఎకరాల భూమిని తిప్పనగుళ్ళ గ్రామానికి చెందిన బీసీలు గౌరి రాజయ్య, గౌరి బుచ్చమ్మల వద్ద దళితులు 40 యేళ్ల క్రితం భూమిని కొనుగోలు చేశారన్నారు. ప్రభుత్వం పట్టా కూడా ఇచ్చిందని, అయితే యేడాది నుంచి సహదేవ్ బెదిరింపులకు పాల్పడుతూ వారిపై దాడి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని చెప్పారు. కార్యక్రమంలో వినోద్, స్వామి, బాబు, శీను తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల'లో పేదలకు అన్యాయం


మాట్లాడుతున్న సురేశ్

నర్సాపూర్: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కాంగ్రెస్ నాయకులు పేదలకు అన్యాయం చేస్తున్నారని బీఎస్ఎల్ జిల్లా సలహా కమిటీ సభ్యుడు, బీజేపీకి చెందిన మాజీ కౌన్సిలర్ సురేశ్ ఆరోపించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ఐదో వార్డులో కాంగ్రెస్ నాయకులు తమ ఇష్టమున్న వారిని ఎంపిక చేశారని, వారి కక్ష పూరిత రాజకీయాల వల్ల పేదలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండు చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు రాజు ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి తదితరులు

చిన్నశంకరంపేట(మెదక్): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నార్సింగిలో ఆయన విలేరులతో మాట్లాడుతూ హామీలలో ప్రధానమైన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2500, ఆసరా పెన్షన్ రూ.4వేలకు పెంచడం, రైతుభరోసా రూ.15వేలకు పెంచడం, భూమిలేని వారికి అందించే రూ.15 వేల సాయం వంటివి అమలు చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, నార్సింగి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాలేజీకి మూడు గదులు కేటాయింపు


పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ జూనియర్ కాలేజీకి ఉన్నత పాఠశాలలోని మూడు గదులను కేటాయిస్తున్నట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు. శివ్వంపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం కలెక్టర్ రాహుల్‌రాజ్ దృష్టికి వెళ్లడంతో ఆరు రోజుల క్రితం పాఠశాల గదులు పరిశీలించి వెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం డీఈఓ రాధాకిషన్ ఉన్నత పాఠశాలను పరిశీలించి మూడు గదులను జూనియర్ కాలేజీ తరగతుల బోధన గురించి కేటాయించారు. సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చనాయక్, ప్రిన్సిపాల్ శైలజ, హెచ్‌ఎం బాలచంద్రం, హాస్టల్ వార్డెన్ యాదగిరి, తదితరులున్నారు.

నార్సింగిలో ఉచిత వైద్య శిబిరం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ఆర్‌వీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు. శేరిపల్లి గ్రామంలో నార్సింగి ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

◆ నేటి నుంచి విద్యార్థుల ఎంపిక

నర్సాపూర్: ఈనెల 18వ తేదీ నుంచి రెండు రోజుల పాటు క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక కొనసాగుతుందని ఎంఈఓ తారాసింగ్ తెలిపారు. క్రీడా పాఠశాలలో చేరేందుకు ఆసక్తి ఉండి మూడో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను మండల స్థాయి ఎంపిక ప్రక్రియకు తీసుకురావాలని ఉపాధ్యాయులను కోరారు. ఎంపిక స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో చేపడుతారని ఆయన పేర్కొన్నారు.

◆ రైతు నేస్తం నిధులు విడుదల

రామాయంపేట(మెదక్): రైతు నేస్తం నిధులను సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం సూచించారు. సంఘం పరిధిలో నిజాంపేట మండలం నస్కల్‌కు చెందిన పాగాల మల్లేశం, దేవరాజ్‌కు రూ.9 లక్షల చొప్పున రుణం మంజూరు కాగా, వారికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ ఇసుక కుప్పలు సీజ్

పాపన్నపేట(మెదక్): మంజీరా నది నుంచి తరలించి నిల్వ చేసిన ఇసుక కుప్పలను మంగళవారం సీజ్ చేసినట్లు ఎమ్మార్వో సతీష్ కుమార్ తెలిపారు. ఆర్ఐ నాగరాజు ఆధ్వర్యంలో సుమారు 20 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

◆ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండ గ్రామానికి చెందిన ఐదుగురికి ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసినట్లు బీఆర్ఎస్ నాయకులు ఎం.శ్రీరాం తెలిపారు. లబ్ధిదారులైన ఎర్కలి పోచమ్మ, తూంకుంట ఎల్లమ్మ, మంచి రవి, చింతల ప్రశాంత్, నాగోజి మంగమ్మలకు రూ 1.02 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. వీరి వెంట నర్సింలు యాదవ్, ఆంజనేయులు, రమేష్, రాజు, దుర్గారెడ్డి, ఆనంద్, బుచ్చయ్య, అర్జున్, రవీందర్, కృష్ణ తదితరులున్నారు.

◆ భూభారతిలో 243 దరఖాస్తులు

కొడిపల్లి(నర్సాపూర్): భూభారతి రెవెన్యూ సదస్సులో 243 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, ఆర్ఐ శ్రీహరి, లక్ష్మణ్ ఆధ్వర్యంలో మండలంలోని కూకుట్లపల్లి, దేవులపల్లి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కూకుట్లపల్లిలో 115, దేవులపల్లిలో 128మంది రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తు చేశారు.

◆ ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు

తూప్రాన్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో నాలుగు రోజులపాటు కొనసాగనున్న గ్రామదేవతల జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం బొడ్రాయికి జలాభిషేకం, అమ్మవార్లకు బోనాల సమర్పణ, ఊరడమ్మకు, మహంకాలమ్మకు పోతరాజుల గావు రంగాలు, శివసత్తుల పూనకాల మధ్య ఉత్సవాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. మహిళలు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహాదేవి, మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, ఎంపీటీసీ వెంకటమ్మ, మాజీ సర్పంచులు జిన్నస్వామి, నరసింహులు, పుష్పలత భూపాల్ పాల్గొన్నారు.

◆ నాణ్యమైన విద్యనందించాలి

రేగోడ్(మెదక్): రేగోడ్‌లోని మోడల్ స్కూల్, కేజీబీవీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని దళిత సంఘాల ఉమ్మడి మండల నాయకుడు దేవరాజ్ మంగళవారం కోరారు. పాఠశాలల్లో టెట్ పాసైన వారితో నియామకం చేయాలన్నారు.

◆ విద్యార్థులకు వైద్య పరీక్షలు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు, సూచనలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ హారిక, సూపర్‌వైజర్ బుజ్జి పాల్గొన్నారు.

◆ బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బీజేపీ నాయకులు మంగళవారం మెదక్ డిపో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎంపీ రఘునందన్‌రావు సూచనల మేరకు స్థానిక బీజేపీ నాయకులు భిక్షపతి, నర్సారెడ్డి, నర్సింలు, విఠల్‌లు మెదక్ డిపో అధికారులకు విన్నవించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నర్సాపూర్ నుంచి పెద్దగొట్టిముక్ల గ్రామం మీదుగా సికింద్రాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తే విద్యార్థులకు, పరిసర గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.